నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

హైదరాబాద్, ఆదివారం 25 మే 2025 | RANGAREDDY


## ఏడు కిచెన్లు సీజ్..

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నగరంలోని పలు ప్రైవేట్ హాస్టళ్లలో జీహెచ్ఎంసీ టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన హాస్టళ్లకు షోకాజు నోటీసులు ఇవ్వడంతో పాటు కిచెన్‌లు సీజ్ చేసి జరిమానాలు విధించాయి. ఎల్బీనగర్ జోన్‌లోని శ్రీనగర్‌కాలనీ, లలితానగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతం, కూకట్‌పల్లి జోన్‌లోని కేపీహెచ్‌బీ, మూసాపేట్ ప్రాంతాలు, శేరిలింగంపల్లి జోన్‌లోని వినాయక్‌నగర్, పత్రికానగర్‌లలో ఈ డ్రైవ్ నిర్వహించారు. 60 హాస్టళ్లను తనిఖీ చేసి 38 హాస్టళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. 7 హాస్టల్ కిచెన్లను మూసివేశారు. జీహెచ్ఎంసీ చట్టం, 1955 నిబంధనల ప్రకారం బృందాలు రూ.2,46,000 జరిమానా విధించాయి. అదేవిధంగా శుక్రవారం 58 హాస్టళ్లను తనిఖీ చేసి 30 హాస్టళ్లకు నోటీసులు జారీ చేసి, 8 హాస్టల్ కిచెన్‌లను సీజ్ చేసి రూ.2.45 లక్షలు జరిమానా విధించారు. హాస్టల్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం కాకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.



కొడంగల్ నియోజకవర్గంలోని ఆలేడు గ్రామంలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో పొలంలోని ఓ బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

# నాడు ఇంట్లోకే నీరు..
# నేడు ట్యాంకర్ల వద్ద పోరు

## వికారాబాద్ జిల్లాలో తాగునీటి కోసం అల్లాడుతున్న గ్రామాల ప్రజలు

### పొలాల వద్దకు రానివ్వడం లేదు..

గత నాలుగు రోజులుగా నీటి కోసం తంటాలు పడుతున్నాం. వాడుకునేం దుకూ నీరు లేదు. దీంతో ఉదయమే ఖాళీ బిందెలను పట్టుకుని పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్తే.. నీళ్లు తక్కువగా వస్తున్నాయని.. తమ పొలాలకే నీళ్లు సరిపోవని వాటి యజమానులు రానివ్వడంలేదు. మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయిందని అధికారులు చెబుతున్నారు. దానికి అధికారులు ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాలి. ఒక్క రోజు కాదు, రెండు రోజులు కాదు ఏకంగా నాలుగు రోజులు నీళ్లు లేకుండా ఎలా ఉండాలి. ఉన్నతాధికారులు స్పందించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.



**- పాషా, ఆలేడ్ గ్రామం, కొడంగల్**

### సీఎం ఇలాకాలో దాహం..దాహం

కొడంగల్, మే 24 : దుద్యాల మండలంలోని ఆలేడ్‌వాసులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గత నాలుగు రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఇంట్లోకే పుష్కలంగా నీళ్లు వచ్చేవని.. గత నాలుగు రోజులుగా ఖాళీ బిందెలతో పొలాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శుభకార్యాలు జరుగుతుండడంతో వాడుకకూ నీళ్లు లేక చాలా ఇబ్బంది అవుతున్నదని పలువురు పేర్కొంటున్నారు. పొలాల్లోని బోరు, బావుల వద్దకు వెళ్తే భూగర్భజలాలు తగ్గిపోయాయని.. పొలానికే నీళ్లు సరిపోవడం లేదని కొందరు అక్కడికి రానివ్వడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### దూరం నుంచి నీటిని మోయలేక పోతున్నాం

ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు రావడంతో తాగునీటి ఎద్దడి తీరిందని సంతోషపడ్డాం. కానీ, గత నాలుగు రోజులుగా నీరు సరఫరా కాకపోవడంతో కాలనీకి దూరంగా ఉన్న ఒక బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. బోరు దూరంగా ఉండడంతో చాలా ఇబ్బందిగా ఉన్నది. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.



**-అమృతమ్మ, ధన్నారం**

### ధన్నారంలో గత నాలుగు రోజులుగా..

వికారాబాద్, మే 24 : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు ధన్నారంలో గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. వాడుకకు నీళ్లు లేకపోవడం మహిళలు అవస్థలు పడుతున్నారు. కాలనీలో ఉన్న రెండు బోర్లు చెడిపోయి నిరుపయోగంగా మారాయి. దీంతో మున్సిపల్ అధికారులు కాలనీవాసులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. అవి ఊడా అరకొరగానే అందుతుండడంతో.. మహిళల మధ్య ప్రతిరోజూ నీటి కోసం చిన్న పాటి యుద్ధమే జరుగు తున్నది. అయినా సరిపడా నీరు అందడంలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇంకా ఎన్ని రోజులు తాగునీటి కోసం అవస్థలు పడాలని అధికారులపై మండిపడుతున్నారు. మా ఇబ్బందులను గుర్తించి నీటి సరఫరాకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని కోరుతున్నారు.



ధన్నారంలో పని చేయని బోరు..

### చాలా ఇబ్బంది అవుతున్నది..

గత నాలుగు రోజులుగా నీళ్లు రావడం లేదు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పొలాల్లోని బోర్ల వద్దకు పనులు మానుకుని వెళ్లాల్సి వస్తున్నది. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో ఈ సమస్య వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఈ సమస్య నెలలో రెండు మూడు సార్లు వస్తున్నది. వాడుకకూ నీళ్లు లేక చాలా ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. మళ్లీ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.



**- వెంకటమ్మ, ఆలేడ్ గ్రామం. కొడంగల్**

### నీటికి తిప్పలవుతున్నది..

అధికారులు ముందుచూపుతో ఆలోచిస్తే బాగుంటుండే.. గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా మారింది. కాలనీలో బోరు మోటర్ ఉన్నా పాడైపోయి నిరుపయోగంగా మారింది. దీంతో ఉదయమే కాలనీకి దూరంగా ఉన్న బోరు వద్దకు ఖాళీ బిందెలతో వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తున్నది. అధికారులు బోరుకు మరమ్మతులు చేయించి ఉంటే నీటి తిప్పలు తప్పేవి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి ఎద్దడిని తీర్చాలి.



**-యశోద, ధన్నారం, వికారాబాద్.**

ఇదేనా 'మార్పు'



వికారాబాద్ : ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న ధన్నారం కాలనీవాసులు

# స్లాట్లు.. పాట్లు..



- రిజిస్ట్రేషన్ స్లాట్ల బుకింగ్‌లో అయోమయం
- రోజుకు 48 స్లాట్లు మాత్రమే..
- స్లాట్ల బుకింగ్ పెంచాలంటున్న క్రయవిక్రయదారులు

షాద్‌నగర్ రూరల్, మే 24 : గత బీఆర్ఎస్ హయాంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్లాట్ల బుకింగ్ జరిగేది. కానీ, నేడు స్లాట్ల బుకింగ్‌లో మార్పులు తీసుకురావడంతో ప్లాట్ల క్రయవిక్రయదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. షాద్‌నగర్ పట్టణంలో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రతిరోజూ 48 స్లాట్లు బుకింగ్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే, స్లాట్ బుక్ చేసుకునే సమయంలో ఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలో అనే ఆప్షన్ లేకపోవడంతో క్రయవిక్రయదారుల్లో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. కొనుగోలు, అమ్మకందారులు ఒక కార్యాలయంలో స్లాట్ బుకింగ్ అయి ఉంటే మరో కార్యాలయానికి వెళ్లడం ద్వారా సమయం వృథా అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఒక వ్యక్తి రెండు లేదా మూడు ప్లాట్లను కొనడం, అమ్మడం చేసి.. స్లాట్ బుకింగ్ చేసుకుంటే ఒకే సమయంలో రెండు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు ఉంటే తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి స్లాట్ బుకింగ్ సంఖ్యను పెంచడంతోపాటు స్లాట్ బుకింగ్ ఆప్షన్ కూడా ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

### స్లాట్ల బుకింగ్‌లో మార్పులు తేవాలి

షాద్‌నగర్‌లో ప్లాట్లు కొనడం, అమ్మడం చేసి స్లాట్లను బుక్ చేసుకుంటే.. ఒక స్లాట్ ఒక కార్యాలయంలో, మరో స్లాట్ మరొక్క కార్యాలయంలో బుక్ అవుతున్నాయి. దీనికి తోడు రెండు కార్యాలయాల్లోనూ ఒకే సమయంలో వస్తుండడంతో చాలా ఇబ్బందిగా ఉన్నది. స్లాట్ బుక్ చేసుకునే సమయంలో కార్యాలయాలకు సంబంధించిన ఆప్షన్‌ను ఇవ్వాలి.



**-పవన్, రియల్టర్, షాద్‌నగర్**

### స్లాట్ల సంఖ్యను పెంచాలి

రియల్ ఎస్టేట్ రంగంలో షాద్‌నగర్ పట్టణం అగ్రగామిగా ఉన్నది. దీనిని దృష్టిలో ఉంచుకుని షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ల బుకింగ్ సంఖ్యను పెంచాలి. ప్రస్తుతం రోజూకు 48 స్లాట్లను బుక్ చేసుకునేలా అవకాశం ఉంది. వాటి సంఖ్యను పెంచాలి



**-సురేశ్, రియల్టర్, ఎలికట్ట**

# మళ్లీ కొవిడ్ టెస్టులు!

**కొవిడ్ కలకలంతో అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ**

**అనుమానిత లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోండి : వైద్యాధికారులు**

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్ పేట్ : కరోనా కేసులు మరోసారి నమోదవుతుండడంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం వెలుగుచూస్తున్న కరోనా వేరియంట్ పెద్ద ప్రమాదకారి కాకపోయినప్పటికీ ముందు జాగ్రత చర్యగా అనుమానిత లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే నగరంలో ఓ పాజిటివ్ కేసు నమోదవడంతో అనుమానితులకు పరీక్షలు జరిపేందుకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నమోదైన కరోనా కేసును దృష్టిలో పెట్టుకుని జిల్లా పరిధిలో మల్కాజిగిరి ఏరియా హాస్పిటల్, జనరల్ హాస్పిటల్‌లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి తెలిపారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇప్పటికే గాంధీ దవాఖానలో కరోనా పరీక్షలు జరుపుతుండగా, మరో 5 కొవిడ్ టెస్ట్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా, వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి తెలిపారు. ప్రస్తుతం జిల్లా పరిధిలో ఎలాంటి కరోనా కేసులు నమోదు కాలేదని, పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికపప్పుడు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో కొండాపూర్ జిల్లా హాస్పిటల్‌తో పాటు వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌లో కరోనా పరీక్షలు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లా పరిధిలో ఎలాంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదని, కేసుల ఆధారంగా కొవిడ్ టెస్ట్ కేంద్రాలను పెంచుతామన్నారు.


### అనుమానాస్పద లక్షణాలుంటే.

అక్కడక్కడ నమోదవుతున్న కరోనా కేసులతో భయపడాల్సిన పనిలేదంటున్నారు వైద్యనిపుణులు. అయితే వైరస్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై కొంత ప్రభావం చూపే అవకాశమున్నందున ఆ రోగులు జాగ్రతలు పాటించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. అంతేకాకుండా కొవిడ్ అనుమానిత లక్షణాలున్నవారు ముందు జాగ్రత్త చర్యగా కరోనా పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎవరికైనా పాజిటివ్ అని నిర్ధారణ జరిగితే వెంటనే వారు స్వీయ ఐసోలేషన్ పాటిస్తూ వైద్యులు సూచించిన మందులు వాడాలని చెబుతున్నారు.

కొవిడ్ కేసుల వ్యాప్తి నేపథ్యంలో గాంధీ దవాఖాన పాలనా యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నదని సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో కొవిడ్ కేసులను ఎదుర్కొనేందుకు 10 మంది వైద్య నిపుణులతో ప్రత్యేక కొవిడ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అలాగే 60 బెడ్లతో కూడిన 3 కరోనా వార్డులను సిద్ధం చేశామన్నారు. ఇందులో అత్యవసర రోగుల కోసం 15 బెడ్లతో స్పెషల్ వార్డును ఎమర్జెన్సీ విభాగం వెనక ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ కొవిడ్ నిబంధనలు పాటించాలని.. లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు

### కొవిడ్ కమిటీ ఇదే

కొవిడ్ కమిటీ చైర్మన్‌గా సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, నోడల్ ఆఫీసర్‌గా జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సునీల్‌కుమార్ వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ఆర్ఎంవో -1 డాక్టర్ శేషాద్రి, పల్మనాలజీ హెచ్‌వోడీ డాక్టర్ కృష్ణమూర్తి, అనస్తీషియా హెచ్‌వోడీ మురళీధర్, పిడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ వాసుదేవ్, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాధ, మైక్రో బయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పూజ, డ్యూటీ ఆర్ఎంవో, పీజీ వైద్యులు ఉన్నారు. కొవిడ్ పాజిటివ్ బాధితులు గాంధీలో అడ్మిట్ అయిన పరిస్థితుల్లో వారికి అందించే అత్యవసర వైద్యం, తదితర వసతులపై ఈ కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుందని డిప్యూటీ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.



గాంధీ దవాఖానలో ఏర్పాటు చేసిన కొవిడ్ వార్డులు

# ఆదాయం కోసం అన్వేషణ

## రాబడి పెంపుపై హెచ్ఎండీఏ నజర్

- డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయేతర భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరణకు కసరత్తు..
- కుర్మల్‌గూడ, లేమూర్, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లోని భూముల ఎంపిక

రంగారెడ్డి, మే 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఆదాయాన్ని సమకూర్చే మార్గాలపై హెచ్ఎండీఏ అన్వేషణ మొదలైంది. ఇందు కోసం మరిన్ని లేఅవుట్లు చేయాలని.. తద్వారా రాబడిని పెంచుకోవాలని భావిస్తున్నది. ఇందు కోసం జిల్లాలోని పలు ప్రాంతాలను ఎంపిక చేసింది. ముఖ్యంగా వ్యవసాయేతర భూములను గుర్తించి ల్యాండ్‌పూలింగ్ ద్వారా వాటిని సేకరించి.. అందులో భారీ లేఅవుట్లను ఏర్పాటు చేస్తే అటు రైతులు, ఇటు ప్రభుత్వానికి ప్రయోజనం కలుగుతుందని యోచిస్తున్నది. నగరం చుట్టూ విస్తరించిన ఉన్న జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు చేసిన హెచ్ఎండీఏ లేఅవుట్లలోని ప్లాట్లు హాట్‌కేకుల్లా అమ్ముడు పోయాయి. అదే తరహాలో.. జిల్లాలో భూములకు డిమాండ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి వ్యవసాయేతర భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించి లేఅవుట్లు చేసి ప్లాట్లు, విల్లాలు, వాణిజ్య భవనాలను నిర్మించాలని భావిస్తున్నారు. రైతుల నుంచి సేకరించే భూమిలో 60 శాతం రైతులకు 40 శాతం హెచ్ఎండీఏ తీసుకునేలా ఒప్పందం చేసుకోవాలని భావిస్తున్నది. ఇందులో భాగంగానే తొలుత కేశంపేట మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో 95.25 ఎకరాలు, కందుకూరు మండలంలోని లేమూర్ గ్రామంలో 88.48 ఎకరాలను లేఅవుట్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అలాగే, బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలో 91.90 ఎకరాల భూమిని తీసుకునేందుకు ఇప్పటికే రైతులతో చర్చించినట్లు సమాచారం.

### ల్యాండ్ పూలింగ్ ద్వారా భూముల సేకరణ..

ప్రైవేట్ భూముల సేకరణ ప్రభుత్వానికి తలకు మించిన భారంగా మారింది. భూసేకరణకు అడుగడుగునా అడ్డంకులొస్తున్నాయి. దీంతో వ్యవసాయేతర భూములను గుర్తించి రైతులను ఒప్పించి, రైతులకు 60 శాతం, హెచ్ఎండీఏకు 40 శాతం కేటాయించి.. లేఅవుట్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. అదేవిధంగా ఆ భూములను అభివృద్ధి చేయడం తోపాటు మరికొంత భాగంలో విల్లాలు, వాణిజ్య భవనాలను నిర్మిం చాలని యోచిస్తున్నది.



### గతంలో పలు హెచ్ఎండీఏ లేఅవుట్లు..

గత బీఆర్ఎస్ హయాంలో కోకాపేట, తొర్రూరు, మోకిల, మన్నెగూడ తదితర ప్రాంతాల్లో హెచ్ఎండీఏ లేఅవుట్లను ఏర్పాటుచేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసే లేఅవుట్లలో మోసా లు, ఇతరత్రా ఇబ్బందులుండవని ఎక్కువమంది ఆ ప్లాట్లను కొనుగోలు చేశారు. ఈ ప్లాట్ల విక్రయాలతో సర్కారుకు భారీగా ఆదాయం వచ్చింది. గతంలో మోకిలలో 65 ఎకరాలు, కుర్మల్‌గూడలో 16, తొర్రూరులో 170, మన్నెగూడలో 16 ఎకరాల్లో లేఅవుట్లు చేశారు. కాగా, కొత్తగా ప్రభుత్వం జిల్లాలో మళ్లీ మరో మూడు చోట్ల హెచ్ఎండీఏ లేఅవుట్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. ఇటీవల హెచ్ఎండీఏ పరిధి పెరగడంతో పలు జిల్లాల్లోని పలు మండలాలు దీని పరిధిలోకి వచ్చాయి. ఓఆర్ఆర్ నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు వరకు భూములకు విపరీతంగా డిమాండ్ ఉన్నది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ పరిధిలో లేఅవుట్లు ఏర్పాటుచేస్తే హాట్‌కేకుల్లా అమ్ముడు పోయే అవకాశాలున్నాయి. ఇప్పటికే జిల్లా శివారు ప్రాంతాల్లో విల్లాల సంస్కృతి కూడా పెరిగిపోయింది. ఎక్కువమంది విల్లాల్లో జీవించేందుకు అలవాటు పడుతున్నారు. దీంతో విల్లాలు, వ్యాపార సముదాయాలు, టౌన్‌షిప్‌ల నిర్మాణంపై హెచ్ఎండీఏ దృష్టి సారిస్తున్నది.